**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-9, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**విజయవాడ,**

**తేది : 03 జూలై, 2023.**

**శ్రీయుత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గారికి,**
గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,
అమరావతి.

**ప్రచురణార్థం:** సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాం. **– జె.జయరాం, ఆఫీసు కార్యదర్శి**

**విషయం : ప్రధానమంత్రిని మీరు కలిసిన సందర్భంగా ఈ క్రింది సమస్యలు ప్రస్తావించాలని కోరుతూ...**

**అయ్యా!**

మీరు ఢిల్లీలో ప్రధానమంత్రిని కలుస్తున్నట్లు పత్రికల్లో చూశాను. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఈ క్రింది ప్రధాన సమస్యలు ప్రధానితో చర్చించి, ఒత్తిడి తెచ్చైనా పరిష్కారానికి పూనుకుంటారని ఆశిస్తున్నాను.

పోలవరం నిర్వాసితులు, గిరిజనులు సుమారు 500 మందితో కలసి గత 14 రోజులుగా పాదయాత్ర చేస్తున్నాను. ఆయా సమస్యల్ని ఎప్పటికప్పుడు మీ దృష్టికి ఈపాటికే నిర్దిష్టంగా ఉత్తరాల ద్వారా తెచ్చాను. పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంత మండలాలైన దేవీపట్నం, చింతూరు, వి.ఆర్.పురం, కూనవరం, ఎటపాక, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడులో పాదయాత్ర చేశాను. నిర్వాసితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన ప్యాకేజీలు ఏవీ అమలు కాలేదు. కేవలం 10–15 శాతం మందికి మాత్రమే అరకొరగా అందజేశారు. 41.5 మీటర్ల వద్ద 20 గ్రామాలు 20 వేల మందిని నిర్వాసితులుగా తేల్చారు. కానీ మొన్నటి వరదల్లో 40 మీటర్లకు 193 గ్రామాలు మునిగాయి. కాంటూరు లెక్కలన్నీ తప్పుడు లెక్కలే. 1986, 2022 వరదల ఆధారంగా రీసర్వే జరగాలి. గత సంవత్సరం వరద వచ్చినప్పుడు ఇవ్వాల్సిన నష్టపరిహారం ఇంకా పూర్తిగా అందలేదు. ఈ సంవత్సరం వరద వచ్చే అవకాశాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలి. ప్రాజెక్టు ఆనుకుని ఉన్న ప్రాంతాల నుండి బలవంతంగా నిర్వాసితులను తరలించారు. ఆ నిర్వాసితుల కాలనీల్లో ఎటువంటి ప్రాథమిక సౌకర్యాలు లేవు. ప్రజలు నానా అగచాట్లు పడుతున్నారు. సంక్షేమ కార్యక్రమాలు అమలు జరగడం లేదు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోగలరని కోరుతున్నాను. వీటికి అవసరమైన నిధులు కేంద్ర ప్రభుత్వం నుండి రాబట్టడానికి ఒత్తిడి తెచ్చి సాధిస్తారని ఆశిస్తున్నాను. నిర్వాసిత ప్రజలకు మీరిచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని కోరుతున్నాను.

రాష్ట్రంలో విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఎన్ని ఆందోళనలు జరుగుతున్నా, బిజెపి తప్ప అన్ని రాజకీయ పార్టీలు, సంఘాలు వ్యతిరేకిస్తున్నా, అసెంబ్లీలో తీర్మానం చేసినా కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణపై ఏమాత్రం తగ్గడం లేదు. విశాఖ ఉక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. కేంద్రం స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి అవసరమైన మైన్స్ కేటాయించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నది. మైన్స్‌ను కేటాయించేట్లు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. అదే సందర్భంలో రాష్ట్రంలో కేటాయించిన గనుల లీజు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించాలి. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపి ప్రభుత్వ రంగంలోనే కొనసాగించడానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతున్నాను. స్టీల్‌ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడిపించి లాభాల్లోకి వచ్చేట్లు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నది.

పై సమస్యల పరిష్కారానికి మీరు ప్రధానమంత్రి గారితో చర్చించి నిర్దిష్ట హామీ తీసుకోవాలని కోరుతున్నాను.

అభివందనములతో...

**(వి.శ్రీనివాసరావు)**
రాష్ట్ర కార్యదర్శి